# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



News Portal Designing
Epaper Designing &
Web Hosting

Vn Media

+91 8099779988
vnteluguday@gmail.com



సంపుటి : 3 | సంచిక : 280 | సోమవారం 16 ఫిబ్రవరి 2026 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri




## ట్రేడ్ డీల్స్‌లో సాధికారికంగా చర్చించే స్థాయికి భారత్ ఎదిగింది

- ఇప్పుడు కాకుంటే, ఎప్పుడూ కాదు అనే బలవంతపు భావన నుంచి ఈ కేంద్ర బడ్జెట్ రాలేదు
- దేశంలో తయారీరంగం, సేవారంగం, ఎంఎస్ఎంఈ పరిశ్రమలు బలోపేతం అయినందు వల్లే భారత్‌కు ఈ సాధికారత లభించింది
- భారత్ ఇప్పటికే 38 దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల(ఎఫ్‌టీఏ)ను కుదుర్చుకుంది
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- వస్త్ర, లెదర్, రసాయన, హస్తకళలు, రత్నాలు, ఇతర రంగాల్లోని భారతదేశ ఎంఎస్ఎంఈలకు విదేశీ మార్కెట్లను తెరిచేందుకు ఈ ఒప్పందాలు దోహదపడతాయి



## మా డబ్బు, గిఫ్ట్‌లు మాకివ్వండి

- ఇంటింటికి వెళ్లి అడుగుతున్న ఓడిపోయిన అభ్యర్థులు
- ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు బహుమతులు ఇచ్చిన అభ్యర్థులు
- మూడుచింతలపల్లి, మంచిర్యాల, భువనగిరిలో బహుమతులు వెనక్కి అడుగుతున్న అభ్యర్థులు
- ఇంటింటికి తిరిగి వసూలు చేసే ప్రయత్నం

హైదరాబాద్

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో ఓడిపోయిన కొందరు అభ్యర్థులు తాము పోలింగ్‌కు ముందు పంచిన నగదు, చీరలు, ఇతర బహుమతులు ఇవ్వాలంటూ ఓటర్లను అడగటం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు ఓటర్లను ప్రభావితం చేయడానికి డబ్బుతో పాటు ఇతర బహుమతులు పంచుతుంటారు. మేడ్చల్ - మిగతా3లో



## రష్యా చమురు కొనుగోళ్లు.. కేంద్రమంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు

- ఇంధన కొనుగోళ్ల విషయంలో రాజకీయ ఒత్తిళ్లు పని చేయవని స్పష్టీకరణ
- ఇంధన కొనుగోళ్ల అంశం జాతీయ ప్రయోజనాలపై ఆధారపడి ఉంటుందన్న జైశంకర్
- భారత్ తన వ్యూహాత్మక ప్రయోజనాలకు కట్టుబడి ఉందని వెల్లడి

## పాలకుడిని కాదు.. సేవకుడిని

- మేం పాలకులం కాదు.. సేవకులం.
- పాలకుడిగా నేను ఎప్పుడూ ప్రవర్తించలేదు
- సేవకుడిగా మాత్రమే వ్యవహరిస్తున్నా
- మాకు సేవ చేయడానికే ప్రజలు అవకాశం ఇచ్చారు
- సేవాలాల్ జయంతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్

రాష్ట్రంలో అన్ని తండాలకు బీటీ రోడ్లు వేయాలని ఆదేశాలు ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ప్రతి తండాలో పాఠశాల భవనాలు ఉండాలని అన్నారు. తండాలకు సోలార్ ప్లాంట్ల ద్వారా కరెంట్ విద్యుత్ ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందని అన్నారు. తాము సంక్షేమంతో పాటు విద్యార్థులకు మంచి విద్య కూడా ఇవ్వాలనుకుంటున్నామని అన్నారు. చదువుకుంటేనే మంచి ఉద్యోగాలు, కీలక పదవులు వస్తాయని అన్నారు. తాము పాలకులం కాదు సేవకులమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తమకు సేవ చేయడానికే ప్రజలు అవకాశం ఇచ్చారని తెలిపారు. పాలకుడిగా తాను ఎప్పుడూ ప్రవర్తించలేదని, సేవకుడిగా మాత్రమే వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. - మిగతా3లో



## రైతులకు పూర్తి రక్షణ...

- రాహుల్ గాంధీ తప్పుదోవపట్టిస్తున్నాడు: అమిత్ షా
- యూఎస్, ఈయూ వాణిజ్య ఒప్పందాలపై కాంగ్రెస్ ఆరోపణలు ఖండించిన అమిత్ షా
- రైతు, పాడి, మత్స్య రంగాలకు పూర్తి రక్షణ కల్పించామని వెల్లడి
- యూపీఏ, ఎన్డీయే వ్యవసాయ బడ్జెట్లను పోల్చిన హోంమంత్రి
- విషయంపై చర్చకు రావాలంటూ రాహుల్ గాంధీకి బహిరంగ సవాల్

## ఈ ఒప్పందం రైతులకు ద్రోహం చేయడమే

- అమెరికాతో ట్రేడ్ డీల్: ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ 5 ప్రశ్నలు
- ప్రధాని మోదీకి 5 సూటి ప్రశ్నలు సంధించిన రాహుల్
- జీఎం పంటలు, సోయా, పాల రంగాలపై ప్రభావంపై ఆందోళన
- భారత వ్యవసాయంపై అమెరికా పట్టు సాధిస్తుందని హెచ్చరిక




## బంజారాలకు మరింత అండగా నిలబడతాం

- సేవాలాల్ జయంతిలో కేటీఆర్ కీలక వ్యాఖ్యలు
- సేవాలాల్ జయంతి ఉత్సవాలను జరుపుకోవడం సంతోషంగా ఉంది
- గిరిజనుల ఆత్మగౌరవానికి న్యాయం చేసిన నాయకుడు కేసీఆర్
- గిరిజన బిడ్డలకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పెంచిన ఘనత కేసీఆర్‌దే




హైదరాబాద్

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పించారు.తెలంగాణ వార్తలు ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. సేవాలాల్ జయంతి ఉత్సవాలను జరుపుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. గిరిజనుల ఆత్మగౌరవానికి న్యాయం - మిగతా3లో



## బంగ్లా నూతన ప్రధాని ప్రమాణ స్వీకారానికి భారత్ ప్రతినిధిగా స్పీకర్ ఓం బిర్లా

- ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తారిఖ్ రెహమాన్ నేతృత్వంలోని బీఎన్‌పీ
- నూతన ప్రభుత్వాన్ని స్వాగతిస్తూ భారత విదేశాంగ శాఖ ప్రకటన
- ఫిబ్రవరి 17న ఢాకాలో జరగనున్న ప్రమాణ స్వీకార కార్యక్రమం
- దాదాపు 35 ఏళ్ల తర్వాత బంగ్లాదేశ్‌కు పురుష ప్రధాని రాక

## బీఆర్ఎస్ మాస్టర్ ప్లాన్

- ఫిరాయింపు ఎమ్మెల్యేలకు కొత్త టెన్షన్..
- మున్సిపల్ పోరులో హంగ్ వచ్చిన స్థానాలపై పార్టీలు ప్రత్యేక ఫోకస్
- ఈ క్రమంలో ఈ ఎన్నికలు బీఆర్ఎస్‌కు అనుకోని వరంలా మారాయా?
- ఫిరాయింపు ఎమ్మెల్యేల పాలిట విప్ తలనొప్పిగా మారనుందా..?
- మ్యాజిక్ ఫిగర్ కోసం ఎమ్మెల్యేల ఓటు కీలకం కావడంతో.. అసమ్మతి నేతలను ఇరుకున పెట్టేందుకు కారు పార్టీ మాస్టర్ ప్లాన్ సిద్ధం



హైదరాబాద్

మున్సిపల్ ఎన్నికలు బీఆర్ఎస్‌కు పెద్దగా కలిసి రాలేదు. కార్పొరేషన్లలోనూ ఆ పార్టీ పెద్దగా ప్రభావం చూపలేదు. ఇలాంటి చేదు అనుభవాలు చవిచూస్తున్న బీఆర్ఎస్‌కు ఈ ఎన్నికలు మరో రకంగా అనుకోని అవకాశం ఇవ్వబోతోందనే చర్చ జరుగుతోంది. ఫిరాయింపు ఎమ్మెల్యేలను ఇరుకున పెట్టేందుకు ఈ ఎన్నికలు బీఆర్ఎస్‌కు అనుకోని విధంగా కలిసొచ్చాయనే ప్రచారం మొదలైంది. మున్సిపల్ - మిగతా3లో

# ఈ ఒప్పందం రైతులకు ద్రోహం చేయడమే

భారత్-అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, మోదీ ప్రభుత్వంపై తన దాడిని మరింత తీవ్రతరం చేశారు. ఈ ఒప్పందం భారత రైతులకు చేసిన ద్రోహమని ఆరోపిస్తూ, ఆదివారం సోషల్ మీడియా వేదికగా ప్రధాని నరేంద్ర మోదీకి ఐదు సూటి ప్రశ్నలు సంధించారు. ఈ వివాదాస్పద ఒప్పందంపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వాణిజ్య ఒప్పందం వల్ల జన్యుపరంగా మార్పు చేసిన (జీఎం) పంటలు, సోయా రైతులపై పడే ప్రతికూల ప్రభావాల గురించి రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో రైతులకు అందుబాటులో ఉన్న రక్షణ కవచాలను కేంద్ర ప్రభుత్వం తొలగిస్తోందని ఆరోపించారు. ఈ ఒప్పందం కేవలం నేటి సమస్య కాదని, భవిష్యత్తులో భారత వ్యవసాయ వ్యవస్థపై మరో దేశానికి దీర్ఘకాలికంగా పట్టును అప్పగించడమేనని ఆయన విమర్శించారు. రైతుల ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ, ప్రధాని మోదీ సమాధానం చెప్పాలంటూ రాహుల్ గాంధీ ఈ ఐదు ప్రశ్నలను లేవనెత్తారు.




1. డీడీజీ (డిస్టిల్లర్స్ డ్రైడ్ గ్రెయిన్) దిగుమతి చేసుకోవడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటి? అంటే, అమెరికా జీఎం మొక్కజొన్నల నుంచి తీసిన ధాన్యాన్ని మన పశువులకు మేపడమేనా? ఇది మన పాల పరిశ్రమను అమెరికా వ్యవసాయ వ్యవస్థతో అనుసంధానం చేయదా?
2. జీఎం సోయా నూనె దిగుమతులకు అనుమతిస్తే.. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్‌తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న మన సోయా రైతుల పరిస్థితి ఏంటి? మరోసారి ధరల పతనాన్ని వారు ఎలా తట్టుకుంటారు?
3. మీరు చెబుతున్న 'అదనపు ఉత్పత్తులు' జాబితాలో ఏముంటాయి? పప్పుధాన్యాలు, ఇతర సున్నితమైన పంటలను కూడా కాలక్రమేణా అమెరికా దిగుమతులకు తెరవాలనే ఒత్తిడికి ఇది సంకేతమా?
4. 'వాణిజ్యేతర అడ్డంకులు' తొలగించడం అంటే ఏమిటి? జీఎం పంటలపై భారత్ తన వైఖరిని నీరుగార్చాలా? సేకరణను బలహీనపరచాలా? లేదా భవిష్యత్తులో కనీస మద్దతు ధర, బోనస్‌లను నిర్వీర్యం చేయాలా?
5. ఒక్కసారి ఈ తలుపు తెరిస్తే, అది ఏటా మరింత పెద్దది కాకుండా ఎలా నివారిస్తాం? రైతులకు తగిన రక్షణ కవచాలు ఉంటాయా? లేక ప్రతి చర్చలోనూ మరిన్ని పంటలను బేరసారాలకు పెడతారా?

ఈ ప్రశ్నలకు జవాబులు ఇవ్వాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

# ట్రేడ్ డీల్స్‌లో సాధికారికంగా చర్చించే స్థాయికి భారత్ ఎదిగింది

వాణిజ్య ఒప్పందాలపై విదేశాలతో సాధికారికంగా చర్చలు జరిపే స్థాయికి భారత్ ఎదిగిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశంలో తయారీరంగం, సేవారంగం, ఎంఎస్ఎంఈ పరిశ్రమలు బలోపేతం అయినందు వల్లే భారత్‌కు ఈ సాధికారత లభించిందని ఆయన తెలిపారు. భారత్ ఇప్పటికే 38 దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల (ఎఫ్‌టీఏ)ను కుదుర్చుకుందని ప్రధాని గుర్తు చేశారు. వస్త్ర, లెదర్, రసాయన, హస్తకళలు, రత్నాలు, ఇతర రంగాల్లోని భారతదేశ ఎంఎస్ఎంఈలకు విదేశీ మార్కెట్లను తెరిచేందుకు ఈ ఒప్పందాలు దోహదపడతాయన్నారు. ఆదివారం ప్రముఖ వార్తాసంస్థ పీటీఐకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ ఈ కామెంట్స్ చేశారు. గత కొన్నేళ్ల వ్యవధిలో మునుపటి రికార్డులను అధిగమించే రేంజులో విదేశాలకు భారత్ వస్తు, ఉత్పత్తుల ఎగుమతులు జరిగాయన్నారు. భారత్‌లో ప్రస్తుతం రాజకీయ సుస్థిరత ఉందని మోదీ తెలిపారు. దేశ రాజకీయ భవితవ్యంపైనా విదేశీ ఇన్వెస్టర్లు ఇప్పుడు ఈజీగా స్పష్టమైన అంచనాకు రావొచ్చన్నారు. అందుకే వారికి భారత మార్కెట్‌పై విశ్వాసం పెరుగుతోందని ప్రధాని చెప్పారు.



**వికసిత దేశంగా ఎదగాలనే ఆరాటానికి ప్రతీక**

ఈసారి పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ అనేది వికసిత దేశంగా ఎదగాలనే భారత్ ఆరాటానికి ప్రతీక అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇప్పుడు కాకుంటే, ఎప్పుడూ కాదు అనే బలవంతపు భావన నుంచి ఈ కేంద్ర బడ్జెట్ రాలేదని, సన్నద్ధత, స్ఫూర్తిలతో ఏర్పడిన మేం సిద్ధం అనే భావన నుంచి ఇది వచ్చిందన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా దేశ రక్షణ రంగాన్ని ఆధునికీకరించాల్సిన బాధ్యత ప్రభుత్వం భుజస్కంధాలపై ఉందని ఆయన తెలిపారు. అందుకోసమే రక్షణ రంగానికి బడ్జెట్ కేటాయింపులను పెంచామన్నారు. దేశ త్రివిధ దళాల బలోపేతం కోసం ఏం చేయడానికైనా సిద్ధమేనని మోదీ వెల్లడించారు.

**ప్రైవేటు రంగం లాభాలపై తక్కువ ఫోకస్ పెట్టాలి**

"భారతదేశ తదుపరి దశ ఆర్థిక పరివర్తనలో ప్రైవేటు రంగం అత్యంత కీలకమైన పాత్రను పోషించాల్సి ఉంటుంది. ఆ రంగం నుంచి నిర్ణయాత్మక స్పందన వస్తుందని నేను ఆశిస్తున్నాను. వికసిత భారత్ దిశగా మన దేశం పయనించాలంటే ప్రైవేటు రంగం ఆవిష్కరణలు, దీర్ఘకాలిక సామర్థ్యం పెంపు, అంతర్జాతీయ మార్కెట్‌తో పోటీ వంటి విభాగాల్లో ధైర్యంగా పెట్టుబడులను పెట్టాలి. ప్రైవేటు రంగం లాభాలను కాపాడుకోవడంపై తక్కువగా, పరిశోధన - అభివృద్ధి (ఆర్అండ్‌డీ), సప్లై చైన్, నాణ్యతలపై ఎక్కువగా ఫోకస్ పెట్టాలి. పారిశ్రామిక ఉత్పాదకత పెరిగితే, ప్రైవేటు కంపెనీల యజమానులు ఆ ఫలాలను పారదర్శకంగా కార్మికులతో పంచుకోవాలి" అని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

**ఆవిష్కరణలు, సామర్థ్యం, ఉత్పాదక శక్తిని పెంచాలి**

"వికసిత భారత్ సాధనలో మహిళలు కీలక పాత్ర పోషిస్తారు అనేది నా బలమైన నమ్మకం. అందుకే మహిళా సంక్షేమం విషయంలో మా ప్రభుత్వం ఎలాంటి రాజీకి తావు ఇవ్వడం లేదు. మా సర్కారు ప్రతీ నిర్ణయంలోనూ మహిళా సంక్షేమ భావన ఉండేలా చూస్తున్నాం. భారత సైనికుల సంక్షేమం అంశానికీ మేం పెద్దపీట వేస్తున్నాం. భారత్ బలంగా, సర్వసన్నద్ధంగా ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. మేం ఇప్పటివరకు ప్రవేశపెట్టిన అన్ని కేంద్ర బడ్జెట్‌లు దేనికవి ప్రత్యేకమైనవి. బడ్జెట్ రూపకల్పన కోసం మేం అనుసరించే ప్రమాణాలు అలాంటివి. కరోనా సంక్షోభ కాలం తర్వాత భారతదేశానికి ఎన్నో రంగాల్లో అవకాశాల తలుపులు తెరుచుకున్నాయి. ప్రోత్సాహకాలు, సుంకాల ప్రాధాన్యతలు అనేవి మన దేశ అభివృద్ధి పయనానికి ఊతాన్ని ఇవ్వగలవు. కానీ నిలకడగా అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీని ఇచ్చే సత్తా రావాలంటే వినూత్న ఆవిష్కరణలు, విశిష్ట సామర్థ్యం, భారీ ఉత్పాదక శక్తిని మనం అందిపుచ్చుకోవాలి" అని ప్రధాని మోదీ చెప్పారు.

**ఏఐ ఎకో సిస్టమ్‌కు భారత్‌లో పునాదులు**

"యూపీఐ వేదిక ద్వారా ప్రజల లావాదేవీలను మేం వేగవంతం చేశాం. అందుకే భారత్ ఇప్పుడు ప్రపంచంలో డిజిటల్ లీడర్‌గా మారింది. ఏఐ టెక్నాలజీకి, ఆవిష్కరణలకు దోహదం చేసే ఎకో సిస్టమ్‌కు సైతం భారత్ పునాదులు వేస్తోంది. కంప్యూటింగ్ పవర్‌ను, డేటా సెంటర్ల మౌలిక సదుపాయాల సామర్థ్యాన్ని మనం పెంచుకుంటున్నాం. భారత చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో మౌలిక సదుపాయాల కల్పన రంగంపై ప్రత్యేక ఫోకస్ పెట్టాం. భవిష్యత్ కోసం బంగారు భారత్‌ను నిర్మిస్తున్నాం. ఈక్రమంలో ఈసారి కేంద్ర బడ్జెట్‌లో మూలధన వ్యయం కోసం రూ.12.2 లక్షల కోట్లను కేటాయించాం. 2013 కేంద్ర బడ్జెట్‌తో పోలిస్తే ఇది ఐదురెట్లు ఎక్కువ" అని ప్రధాని మోదీ వివరించారు.

# బంగ్లాదేశ్‌లో ఎన్నికలు పూర్తి... మహ్మద్ యూనస్ పరిస్థితేంటి?

బంగ్లాదేశ్ రాజకీయాల్లో ఒక కీలక అధ్యాయం ముగిసి, కొత్త శకం ప్రారంభమవుతోంది. 2024లో షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత తాత్కాలిక ప్రభుత్వ అధినేతగా దేశాన్ని నడిపించిన నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మహ్మద్ యూనస్, ఎన్నికైన ప్రభుత్వానికి అధికారాన్ని బదిలీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఘన విజయం సాధించడంతో, ఆ పార్టీ చైర్మన్ తారిక్ రహ్మాన్ దేశ నూతన ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. సుమారు 17 ఏళ్ల పాటు విదేశాల్లో ప్రవాస జీవితం గడిపిన ఆయన, ఇప్పుడు దేశ రాజకీయాల్లోకి పునరాగమనం చేస్తున్నారు.

ఫిబ్రవరి 17న జరగనున్న తారిక్ రహ్మాన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ సహా 13 దేశాల అధినేతలకు ఆహ్వానాలు పంపారు. దేశంలో స్థిరత్వం, సమగ్ర పాలన అందించి అభివృద్ధి పథంలో నడిపిస్తామని తారిక్ రహ్మాన్ ఇప్పటికే ప్రకటించారు. ఈ అధికార మార్పిడి నేపథ్యంలో, మహ్మద్ యూనస్ భవిష్యత్తుపై తీవ్రమైన చర్చ జరుగుతోంది. ఆయనకు రాజ్యాంగబద్ధమైన పదవి, ముఖ్యంగా రాష్ట్రపతి పదవి ఇవ్వాలనే డిమాండ్ సోషల్ మీడియాలో బలంగా వినిపిస్తోంది. యూనస్‌కు ఉన్న అంతర్జాతీయ ఖ్యాతిని ఉపయోగించుకుని, కొత్త ప్రభుత్వం దేశ దౌత్య సంబంధాలను బలోపేతం చేసుకోవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. "దేశీయ వ్యవహారాలపై దృష్టి సారించే ప్రధాని, అంతర్జాతీయంగా పలుకుబడి ఉన్న రాష్ట్రపతి ఉంటే బంగ్లాదేశ్‌కు ఎంతో మేలు జరుగుతుంది" అని ప్రముఖ కాలమిస్ట్ డేవిడ్ బెర్గ్‌మాన్ వ్యాఖ్యానించారు.




ఈ ఊహాగానాలపై బీఎన్‌పీ వర్గాలు ఆచితూచి స్పందించాయి. ఎన్‌డీటీవీతో మాట్లాడుతూ తారిక్ రహ్మాన్ సన్నిహిత సలహాదారు హుమయూన్ కబీర్, "తారిక్ రహ్మాన్ సమగ్ర పాలనకు కట్టుబడి ఉన్నారు. దేశంలోని అత్యుత్తమ మేధావుల సేవలను వినియోగించుకోవాలని ఆయన భావిస్తున్నారు. యూనస్‌తో చర్చలు జరిగాయి కానీ, ఏ పదవీ ఖరారు కాలేదు. రాజకీయాల్లో ఏదీ అసాధ్యం కాదు, దేశ ప్రయోజనాల దృష్ట్యా ఉత్తమ నిర్ణయం తీసుకుంటారు" అని పేర్కొన్నారు. అయితే, ఈ ప్రచారాన్ని మహ్మద్ యూనస్ కార్యాలయం ఖండించింది. ఆయన ప్రెస్ సెక్రటరీ షఫీకుల్ ఆలం మాట్లాడుతూ, "యూనస్‌కు రాజకీయాల్లోకి వచ్చే ఆసక్తి ఎంతమాత్రం లేదు. ఆయన ఏ రాజ్యాంగ పదవినీ ఆశించడం లేదు. తన పాత బాధ్యతల్లోకి తిరిగి వెళతారు. పేదరికం, నిరుద్యోగం, కర్బన ఉద్గారాలు లేని సమాజం అనే తన 'త్రీ జీరోస్' లక్ష్య సాధన కోసం పనిచేస్తారు. కొత్త సామాజిక వ్యాపారాలు ప్రారంభిస్తూ, యువతతో కలిసి పనిచేయడానికే ఆయన ప్రాధాన్యత ఇస్తారు" అని స్పష్టం చేశారు. తన పరిమిత కాలంలో దేశంలో శాంతి, స్థిరత్వం తీసుకురావడంలో యూనస్ సఫలమయ్యారని, ఇప్పుడు బాధ్యతలను కొత్త ప్రభుత్వానికి అప్పగించి రాజకీయాల నుంచి పూర్తిగా వైదొలగనున్నారని ఆయన వివరించారు. దీంతో యూనస్ రాజకీయ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు తెరపడినట్లయింది.

## రైతులకు పూర్తి రక్షణ...

అమెరికా, యూరోపియన్ యూనియన్‌లతో భారత్ ఇటీవల కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాల వల్ల దేశంలోని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందంటూ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రంగా ఖండించారు. రైతుల విషయంలో కాంగ్రెస్, ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ అబద్ధాలు ప్రచారం చేస్తూ దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రతి ఒప్పందంలోనూ వ్యవసాయం, పాడి, మత్స్య రంగాల ప్రయోజనాలకు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పించిందని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం గాంధీనగర్‌లో దేశంలోనే తొలి సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ ఆధారిత ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై అమిత్ షా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పార్లమెంటులో నిలబడి రాహుల్ గాంధీ రైతుల ప్రయోజనాలను కాపాడతామని మాట్లాడటం నవ్వొస్తోందని ఎద్దేవా చేశారు. దేశ ప్రజలను తప్పుదోవ పట్టించడంలో కాంగ్రెస్‌కు సుదీర్ఘ చరిత్ర ఉందని, ఇప్పుడు వాణిజ్య ఒప్పందాల గురించి అబద్ధాలు ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో జరిగిన ప్రతి చర్చలోనూ రైతులు, పశుపోషకులు, మత్స్యకారుల ప్రయోజనాలకు ఎలాంటి హాని కలగకుండా సంపూర్ణ భద్రత కల్పించారని హామీ ఇచ్చారు. గత యూపీఏ ప్రభుత్వంతో పోలుస్తూ తమ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి చేసిన మేలును అమిత్ షా వివరించారు. మన్మోహన్ సింగ్ హయాంలో కేవలం రూ. 26,000 కోట్లుగా ఉన్న వ్యవసాయ బడ్జెట్, ప్రధాని మోదీ నాయకత్వంలో రూ. 1,29,000 కోట్లకు పెరిగిందని గుర్తుచేశారు. గత దశాబ్ద కాలంలో కనీస మద్దతు ధరకు ఆహార ధాన్యాల సేకరణ పదిహేను రెట్లు పెరిగిందని తెలిపారు. "70 ఏళ్లుగా కాంగ్రెస్ రుణమాఫీ గురించి మాట్లాడిందే తప్ప చేసిందేమీ లేదు. కానీ మా ప్రభుత్వం, రైతులు అప్పులపాలు కాకుండా ఉండేందుకు ఏటా రూ. 6,000 నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది" అని ఆయన అన్నారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల దేశీయ పాడి రంగం దెబ్బతింటుందన్న విమర్శలను కూడా ఆయన తిప్పికొట్టారు. ప్రభుత్వం పాడి ఉత్పత్తి రంగాన్ని బలహీనపరచలేదని, మరింత బలోపేతం చేసిందని స్పష్టం చేశారు. అన్ని ఒప్పందాలలోనూ పాడి రంగానికి పూర్తి రక్షణ కల్పించామని పేర్కొన్నారు. ఈ అంశంపై ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు రావాలంటూ రాహుల్ గాంధీకి సవాల్ విసిరారు. బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు కూడా ఈ చర్చకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. గత నెలలో భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలు ముగియడం, అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదరడం వంటి పరిణామాల నేపథ్యంలో అమిత్ షా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## బంగ్లా నూతన ప్రధాని ప్రమాణ స్వీకారానికి భారత్ ప్రతినిధిగా స్పీకర్ ఓం బిర్లా



బంగ్లాదేశ్‌లో కొత్తగా ఎన్నికైన ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారత ప్రభుత్వం తరఫున లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమం ఫిబ్రవరి 17న రాజధాని ఢాకాలో జరగనున్నట్లు భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇటీవల జరిగిన బంగ్లాదేశ్ పార్లమెంటరీ ఎన్నికల్లో తారిఖ్ రెహమాన్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ కీలక కార్యక్రమంలో స్పీకర్ పాల్గొనడం ఇరు దేశాల ప్రజల మధ్య ఉన్న బలమైన, చిరకాల స్నేహానికి నిదర్శనమని విదేశాంగ శాఖ తెలిపింది. "చరిత్ర, సంస్కృతి, పరస్పర గౌరవంతో ముడిపడి ఉన్న పొరుగు దేశంగా, తారిఖ్ రెహమాన్ నాయకత్వంలో ఏర్పడుతున్న ఎన్నికైన ప్రభుత్వాన్ని భారత్ మనస్ఫూర్తిగా స్వాగతిస్తోంది. ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఉన్న బంగ్లాదేశ్‌కు మా మద్దతు ఎల్లప్పుడూ ఉంటుంది" అని ప్రకటనలో పేర్కొంది. ఫిబ్రవరి 12న 300 స్థానాలకు గాను 299 స్థానాలకు పార్లమెంటరీ ఎన్నికల పోలింగ్ జరిగింది. ఇప్పటివరకు ప్రకటించిన ఫలితాల ప్రకారం, బీఎన్‌పీ 209 సీట్లు గెలుచుకుంది. మరోవైపు, జమాత్-ఎ-ఇస్లామీ 68 స్థానాలు కైవసం చేసుకుంది. ప్రముఖ బంగ్లాదేశ్ పత్రిక 'ప్రొథోమ్ ఆలో' కథనం ప్రకారం, ఫలితాలు నిలిపివేసిన రెండు నియోజకవర్గాల్లోనూ బీఎన్‌పీ అభ్యర్థులే ఆధిక్యంలో ఉన్నారు. ఫిబ్రవరి 17న జాతీయ సంసద్ భవన్‌లో కొత్తగా ఎన్నికైన సభ్యులతో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఎ.ఎం.ఎం. నసీరుద్దీన్ ప్రమాణం చేయించనున్నారు. దాదాపు 35 ఏళ్ల తర్వాత బంగ్లాదేశ్‌కు ఒక పురుషుడు ప్రధానమంత్రి కానున్నారు. అయితే, గత 18 నెలల తాత్కాలిక ప్రభుత్వ హయాంలో పెరిగిన అశాంతి, తీవ్రవాదాన్ని అధిగమించడం కొత్త ప్రభుత్వానికి అతిపెద్ద సవాల్‌గా నిలవనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## రష్యా చమురు కొనుగోళ్లు.. కేంద్రమంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు



రష్యా నుంచి చమురు కొనుగోలుకు సంబంధించి కేంద్ర మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంధన కొనుగోళ్ల విషయంలో రాజకీయ ఒత్తిళ్లు పని చేయవని ఆయన స్పష్టం చేశారు. అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేసిందంటూ అమెరికా ప్రకటించింది. ఈ నేపథ్యంలో జైశంకర్ స్పందించారు. ఇంధన కొనుగోళ్ల అంశం జాతీయ ప్రయోజనాలపై ఆధారపడి ఉంటుందని అన్నారు. జర్మనీలోని మ్యూనిచ్ భద్రతా సమావేశంలో పాల్గొన్న ఆయన ఓ ప్రశ్నకు బదులిస్తూ, చమురు కొనుగోళ్ల విషయంలో భారత్ చాలా స్వతంత్రంగా వ్యవహరిస్తుందని ఆయన తెలిపారు. భారత్ తన వ్యూహాత్మక ప్రయోజనాలకు కట్టుబడి ఉందని అన్నారు. ఇంధన సమస్యల విషయానికి ప్రస్తుతం మార్కెట్ సంక్లిష్టంగా ఉందని వెల్లడించారు. చమురు కొనుగోళ్లకు సంబంధించి భారత్‌లోని కంపెనీలు యూరోప్‌తో సహా ప్రపంచంలోని ఇతర ప్రాంతాలను పరిశీలిస్తాయని అన్నారు. ఖర్చులు, నష్టాలు, లభ్యతను చూసి వారి ప్రయోజనాలకు తగినట్లు కొనుగోళ్లు జరుపుతారని వెల్లడించారు.

# పాలకుడిని కాదు.. సేవకుడిని

-మొదటిపేజీ తరువాయి

నేనే రాజు నేనే మంత్రి వ్యాఖ్యలను వక్రీకరించారని చెప్పారు. గెలుపు ఓటమి అన్నింటికీ తానే బాధ్యత తీసుకుంటానని చెప్పానన్నారు. వివిధ వర్గాలను పరిపాలనలో భాగస్వాములను చేయాలనే ఆలోచన తనదని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఎస్సీలు 17 శాతం ఉంటే తమ ప్రభుత్వంలో 30 శాతం ఉన్నారన్నారు. దళితులకు 3 మంత్రి పదవులు, స్పీకర్ ఇచ్చామన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసి వారికి మేలు చేశామన్నారు. సంత్‌సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన ఈ మేరకు మాట్లాడారు. సేవాలాల్ జయంతిని అధికారికంగా చేయడం తమ ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. అచ్చంపేట అడవుల్లో 20 ఎకరాల్లో సంత్ సేవాలాల్ పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

లంబాడీలు నాకు అండగా నిలిచారు : తెలంగాణ ఉద్యమంలో లంబాడీల పాత్ర మరిచిపోలేనిదన్న సీఎం రేవంత్, వారికి సముచిత స్థానం కల్పించాలని తమ ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. తాను గతంలో జడ్పీటీసీగా గెలిచేందుకు సహకరించింది నాగర్‌కర్నూల్ జిల్లా మిడ్జిల్‌లోని లంబాడీ యువకులేనని తెలిపారు. 20 ఏళ్ల రాజకీయ జీవితంలోని ప్రతి సందర్భంలో లంబాడీలు తనకు అండగా నిలిచారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రంలోని తండాలకు బీటీ రోడ్లు వేయాలని ఆదేశాలు ఇస్తున్నట్లు తెలిపారు.



రాష్ట్రంలోని అన్ని తండాల్లో రహదారులు మంచిగా ఉండాలనే ఆలోచనతోనే బీటీ రోడ్లు వేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రతి తండాలో పాఠశాల భవనాలు ఏర్పాట్లు చేయాలన్నారు. సోలార్ ప్లాంట్ల ద్వారా కరెంటు ఇచ్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపారు. గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. సన్నబియ్యం ధరలు తగ్గాయ్ : ప్రస్తుతం మార్కెట్‌లో కిలో సన్నబియ్యం ధర రూ.45కు తగ్గిందని ముఖ్యమంత్రి చెప్పారు. 51 లక్షల పేద కుటుంబాలు 200 యూనిట్ల విద్యుత్ వినియోగిస్తున్నాయని చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణం కోసం ప్రభుత్వం రూ.9 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లోని 40 శాతం మెస్ ఛార్జీలు, 200 శాతం కాస్మోటిక్ ఛార్జీలు పెంచామన్నారు. 87 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు గ్రూప్ 1 ఉద్యోగాలు వచ్చాయని పేర్కొన్నారు.

ప్రభుత్వం వద్ద ప్రస్తుతం భూములు లేవని, కానీ ప్రజలకు సంక్షేమంతో పాటు విద్య ఇవ్వాలనుకుంటున్నట్లు సీఎం చెప్పారు. చదువు వల్ల కీలక పదవులు వస్తాయన్న ఆయన, చదువుకునే వారికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. బాలురకు 100, బాలికలకు 200 యంగ్ ఇండియా స్కూల్స్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. తాను చేయించిన సర్వేలో ఆస్తుల వల్ల కాదు, చదువు లేకపోవడం వల్ల పేదరికం వచ్చినట్లు తేలిందన్నారు. వెనుకబాటు తనం అన్నది ఒక శిక్ష అని, చదువు ఒక్కటే సమాజంలో ఒక హోదాలో నిలబెడుతుందని స్ఫూర్తి నింపారు. పేద పిల్లలకు చదువు అందించడానికి ఎన్ని డబ్బులు అయినా ఖర్చు చేస్తానన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటమిపై విపక్ష నేతలు ప్రజలను నిందిస్తున్నారని మండిపడ్డారు. "మేం పాలకులం కాదు, సేవకులం. మేం సేవ చేయడానికి ప్రజలు మాకు అవకాశం ఇచ్చారు. నేను ఎప్పుడూ దానిని గుర్తు పెట్టుకుంటా. పాలకుడిగా ఎప్పుడు నేను ప్రవర్తించలేదు, సేవకునిగా నా బాధ్యతను నిర్వహిస్తున్నా. ఏ వర్గాలైతే నాకు ఈ హోదా ఇచ్చారో వారికి తిరిగి సేవ చేయాలనే ఉద్దేశంతో ఉన్నాం. నేనే రాజు, నేనే మంత్రి అనే మాటలను వక్రీకరించారు. ముఖ్యమంత్రిగా, మున్సిపల్ మంత్రిగా నేనే ఉన్నాను. ఎన్నికల్లో గెలుపు ఓటములకు నాదే బాధ్యతని అని చెప్పాను"

# ఆర్ఎంఓలు మరింత మంది!

**ఖమ్మం :** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోకి వెళ్లాక విభాగాలు విస్తరించాయి. మెడికల్ కళాశాలకు అనుసంధానంగా ఆస్పత్రికి ఎక్కువ సంఖ్యలో వైద్యులు, పారామెడికల్ సిబ్బందిని కేటాయించారు. అయినప్పటికీ వైద్యసేవలు మాత్రం పూర్తి స్థాయిలో మెరుగుపడలేదు. సిబ్బందిని పర్యవేక్షించాల్సిన అధికారులు అవసరం మేర లేకపోవడమే ఇందుకు కారణమని ఇటీవల నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ గుర్తించారు. ఈమేరకు రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్(ఆర్ఎంఓ) పోస్టులు భర్తీ చేయాలని మెడికల్ సూపరింటెండెంట్ ఎం.నరేందర్‌ను ఆదేశించారు. దీంతో పాలనా సౌలభ్యం కోసం పలు విభాగాల పర్యవేక్షణకు ఆర్ఎంఓలను నియమించారు.



### సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లకు బాధ్యతలు

ప్రస్తుతం సివిల్ సర్జన్ ఆర్ఎంఓ పోస్టు ఖాళీగా ఉండడడంతో రెగ్యులర్ డిప్యూటీ సివిల్ సర్జన్ బి.రాంబా బు ఆర్ఎంఓగా ఆస్పత్రి మొత్తాన్ని పర్యవేక్షిస్తున్నా రు. అటు మెడికల్ సూపరింటెండెంట్, ఇటు ఆర్ఎంఓతో అన్ని విభాగాలు పర్యవేక్షించడం కష్టమవుతోంది. ఈ నేపథ్యాన కొందరు సమయపాలన పాటించకపోగా సేవలకు విఘాతం ఏర్పడుతోంది. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు జనరల్ ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న నలుగురు సివిల్ అసిస్టెంట్ సర్జన్ వైద్యులకు తాత్కాలికంగా ఆర్ఎంఓలుగా బాధ్యతలు అప్పగించారు. వీరిలో డాక్టర్ కె.శ్రీలతకు మాతా శిశు ఆరోగ్య కేంద్రం గ్రౌండ్ ఫ్లోర్, ఎం.అనితకు ఎంసీహెచ్ మొదటి, రెండో ఫ్లోర్ బాధ్యతలు అప్పగించారు. వీరు ఓపీ, ఐపీ వార్డులు, నర్సింగ్ స్టాఫ్ విధులు, శానిటేషన్, పేషంట్ కేర్ సర్వీస్, ఎమర్జెన్సీ కేసుల పర్యవేక్షణ ఇతర బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. అలాగే డాక్టర్ రాజేంద్రప్రసాద్‌కు శానిటేషన్ పర్యవేక్షణ, నర్సింగ్, ఇతర సిబ్బంది విధుల పర్యవేక్షణ, వార్డుల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. ఇక డాక్టర్ డి.శ్రీకాంత్ జనరల్ ఆస్పత్రి గ్రౌండ్ ఫ్లోర్‌లో విధులను పర్యవేక్షిస్తారు. ఫలితంగా పెద్దాస్పత్రిలో 24 గంటల పాటు పర్యవేక్షణ ఉంటుందని మెడికల్ సూపరింటెండెంట్ నరేందర్ తెలిపారు.

# ఎక్స్‌అఫీషియోలు కీలకం

**సంగారెడ్డి :** హంగ్ ఫలితాలు వచ్చిన మున్సిపాలిటీల్లో ఎక్స్‌అఫీషియో సభ్యుల ఓటు ఎంతో కీలకంగా మారింది. ఆయా మున్సిపాలిటీల్లో ఈ ఎక్స్‌అఫీషియో సభ్యులుగా తమ పేరు నమోదు చేసుకున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలకు ఆయా బల్దియాల చైర్మన్ ఎన్నికలో ఓటు వేసే అధికారం ఉంటుంది. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన ఈ ప్రజాప్రతినిధులు ఎవరెవరు ఏ మున్సిపాలిటీల్లో ఎక్స్‌అఫీషియో సభ్యులుగా పేర్లు నమోదు చేసుకున్నారనే విషయాన్ని పరిశీలిస్తే..మాజీ సీఎం కేసీఆర్ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ మున్సిపాలిటీలో ఎక్స్‌అఫీషియో సభ్యునిగా నమోదు చేసుకున్నారు. ఇదే మున్సిపాలిటీ ఉమ్మడి మెదక్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ యాదవరెడ్డి కూడా నమోదు చేసుకున్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ తన నియోజకవర్గం సంగారెడ్డి జిల్లా అందోల్ జోగిపేట మున్సిపాలిటీలో, మంత్రి పొన్నం ప్రభాకర్ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో, నారాయణఖేడ్ బల్దియాలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి (కాంగ్రెస్)లు ఎక్స్‌అఫీషియో సభ్యులుగా పేరు నమోదు చేసుకున్నారు. హంగ్ ఫలితాలు వచ్చిన మెదక్ మున్సిపాలిటీలో స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే రోహిత్‌రావుతోపాటు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు వెంకట్‌రామిరెడ్డి, దేశపతి శ్రీనివాస్, సురేశ్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. అలాగే హంగ్ ఫలితాలు వచ్చిన సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్ మున్సిపాలిటీలో బీజేపీ ఎంపీ రఘునందన్ రావుతోపాటు, స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిలు నమోదు చేసుకున్నారు. దుబ్బాకలో కొత్తా ప్రభాకర్‌రెడ్డి (బీఆర్ఎస్), నర్సాపూర్‌లో స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డిఎక్స్ అఫీషియో సభ్యులుగా పేరు నమోదు చేసుకున్నారు. ఎక్స్‌అఫీషియో సభ్యునిగా నమోదు చేసుకునేందుకు ఆదివారం మధ్యాహ్నం 3 గంటల వరకు సమయం ఉందని బల్దియా వర్గాలు పేర్కొంటున్నాయి.



# దుబ్బాక ఎవరికో..?

**దుబ్బాక:** మున్సిపాలిటీలో 20 వార్డులకు గాను బీఆర్ఎస్ నుంచి 11 మంది కౌన్సిలర్లు, కాంగ్రెస్ 4, బీజేపీ నుంచి ఇద్దరు, ఏఐఎఫ్‌బీ నుంచి ఒకరు, ఇండిపెండెంట్లు ఇద్దరు గెలుపొందారు. బీఆర్ఎస్‌కు మరో ఇండిపెండెంట్ అభ్యర్థి సైతం చేరడంతో ఆ పార్టీ బలం 12కు చేరుకుంది. మరో ఇద్దరు కౌన్సిలర్లు సైతం బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉన్నారు. ఈ క్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ బండి శ్రీలేఖ, 19వ వార్డు కౌన్సిలర్ శ్రీరాం సంగీత చైర్‌పర్సన్ పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆశీస్సులున్న వారే చైర్‌పర్సన్ అయ్యే అవకాశాలు ఉంటాయి.



### గజ్వేల్‌లో ఎడతెగని ఉత్కంఠ

గజ్వేల్: గజ్వేల్‌ప్రజ్ఞాపూర్ మున్సిపల్ క్యాంపు రాజకీయం రసకందాయంలో పడింది. చైర్మన్ ఎన్నికకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్‌తోపాటు ఇండిపెండెంట్‌తో కలుపుకొని 12 కౌన్సిలర్ స్థానాలను సాధించిన బీఆర్ఎస్ కట్టుదిట్టమైన ఏర్పాట్లతో క్యాంపు నడుపుతోంది. పనిలోపనిగా రెండు ఎక్స్ గ్రేషియో ఓట్లను బీఆర్ఎస్ సిద్ధం చేసుకున్నది. ఇందులో స్థానిక ఎమ్మెల్యే, మాజీ సీఎం కేసీఆర్ కాగా, మరొకరు ఉమ్మడి మెదక్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి ఉన్నారు. కాగా చైర్మన్ పీఠం కోసం 17వార్డు కౌన్సిలర్ కళ్యాన్‌కర్ పద్మబాయి, 19వవార్డు కౌన్సిలర్ గంగిశెట్టి చందనలు పోటీపడుతుండగా.. వీరిలో ఎవరిని ఎంపిక చేస్తారనే అంశంపై ఉత్కంఠ నెలకొంది.

### వైస్ చైర్మన్ 'బరి'లో ఇద్దరు

మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి కోసం సైతం పోటాపోటీ ప్రయత్నాలు కూడా తెరమీదికి వచ్చాయి. రెండవ వార్డులో మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ సతీమణి(బీజేపీ)పై అధిక మెజార్టీతో విజయం సాధించిన గోలీ మమత, 20వ వార్డులో ఇండిపెండెంట్‌గా గెలుపొందిన అత్తెల్లి శ్రీనివాస్ తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. వీరిద్దరిలో ఎవరిని ఎంపిక చేయాలనే అంశంలోనూ పార్టీ ముఖ్యనేతలు తర్జనభర్జన పడుతున్నారు. ఇక ఏడు కౌన్సిలర్ స్థానాలను సాధించిన అధికార కాంగ్రెస్ పార్టీ సైతం క్యాంపు రాజకీయాలకు నడపటం కూడా ఆసక్తిని రేకెత్తిస్తున్నది.

## బంజారాలకు మరింత అండగా నిలబడతాం..

-మొదటిపేజీ తరువాయి

చేసిన నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. లంబాడా తండాలను గ్రామ పంచాయితీలుగా చేసింది కేసీఆర్ అని చెప్పారు. 3146 కొత్త గ్రామ పంచాయితీలను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు 3146 మంది గిరిజన బిడ్డలు సర్పంచ్‌లు అయ్యారని తెలిపారు. గిరిజన తండాల్లో ఇంటింటికీ నీటి వసతి కల్పించామని పేర్కొన్నారు. నాలుగున్నర లక్షల ఎకరాలకు కేసీఆర్ ఒకే రోజు పోడు పట్టాలిచ్చారని అన్నారు. గిరిజన బిడ్డల విద్య కోసం వందలాది గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశామని తెలిపారు. గిరిజన బిడ్డలకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పెంచిన ఘనత కేసీఆర్‌దే అని కేటీఆర్ స్పష్టం చేశారు. గిరిజన వ్యాపారవేత్తలకు సీఎంఎస్‌టీ ఆంత్రప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రామ్ తీసుకొచ్చామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో లక్షలాది రూపాయలు ప్రభుత్వ సబ్సిడీ ఇచ్చామని అన్నారు. బంజారా బిడ్డలకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు ఇచ్చామని అన్నారు. ప్రతి జిల్లాలో బంజారా భవన్‌కు స్థలం ఇచ్చామని, బంజారా భవన్‌లు కట్టామని తెలిపారు. రానున్న రోజుల్లో బంజారాలకు మరింత అండగా నిలబడతామని హామీ ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణిని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నాయని కేటీఆర్ ఆరోపించారు. సింగరేణిని కాపాడేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తామని తెలిపారు.మున్సిపాలిటీల్లో హంగ్ వచ్చిన చోట అధికార కాంగ్రెస్ పార్టీ అరాచకాలు చేస్తుందని మండిపడ్డారు. పోలీసులతో కలిసి బీఆర్ఎస్ కార్యకర్తలను వేధింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఆ అరాచకాలను మా కార్యకర్తలు దీటుగా ఎదుర్కొంటున్నారని తెలిపారు.

## మా డబ్బు, గిఫ్టులు మాకివ్వండి

-మొదటిపేజీ తరువాయి

మల్కాజ్‌గిరి జిల్లాలోని మూడుచింతలపల్లి పొన్నాల వార్డులో ఓ అభ్యర్థి తాను పంచిన వాటిని తిరిగివ్వాలని ఓటర్లను అడుగుతున్నారు. ఎన్నికలకు ముందు తాను ఇచ్చిన మందు, చీరలు, డబ్బు తిరిగి ఇవ్వాలని ఈ వార్డులో ఓడిపోయిన ఓ అభ్యర్థి అడుగుతున్నారు. సదరు అభ్యర్థి ఇంటింటికి తిరుగుతూ తన బహుమతులు వసూలు చేసుకునే ప్రయత్నం చేయడం గమనార్హం. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లోని తొమ్మిదవ వార్డులో కూడా ఓ అభ్యర్థి తనకు ఎవరెవరు ఓటు వేశారు, ఎవరు వేయలేదో ఇంటింటికి వెళ్లి లెక్కలు వేసుకుంటున్నారు. తనకు ఓటు వేయని వారు తాను ఇచ్చిన బహుమతులను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరి మున్సిపాలిటీలోనూ ఒకటో వార్డులో ఓడిపోయిన ఒక అభ్యర్థి తాను పంచిన చీరలు, హాట్ బాక్సులు తిరిగి ఇవ్వాలని ఇంటింటికి వెళుతున్నారు.

## బీఆర్ఎస్ మాస్టర్ ప్లాన్..

- మొదటిపేజీ తరువాయి



ఎన్నికల్లో 30కి పైగా మున్సిపాలిటీల్లో ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో హంగ్ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఇక్కడ మున్సిపల్ చైర్మన్ పీఠాలను దక్కించుకోవడానికి ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఓట్లు అత్యంత కీలకంగా మారాయి. మ్యాజిక్ ఫిగర్ కోసం ప్రతి ఓటు కీలకం కావడంతో ఇప్పుడు అందరి దృష్టి స్థానిక ప్రజాప్రతినిధులపైనే నెలకొంది.

ఈ కీలక సమయంలో బీఆర్ఎస్ నుంచి గెలిచి.. ప్రస్తుతం కాంగ్రెస్‌తో కలిసి పని చేస్తున్న ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ఆ ఎమ్మెల్యేలను ఇరుకున పెట్టేలా విప్ ఆయుధాన్ని వాడుకోవాలని బీఆర్ఎస్ నాయకత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఎక్స్ అఫీషియో ఓటింగ్ సమయంలో పార్టీ ఆదేశాలను ధిక్కరించకుండా ఉండేందుకు విప్ జారీ చేయాలని ఆ పార్టీ ప్లాన్ చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఒకవేళ ఫిరాయింపు ఎమ్మెల్యేలు పార్టీ జారీ చేసిన విప్‌ను ఉల్లంఘించి కాంగ్రెస్‌కు అనుకూలంగా ఓటు వేస్తే ఆ సాక్ష్యాలతో అనర్హత వేటు వేయించేందుకు అవకాశం దొరుకుతుందని బీఆర్ఎస్ ప్లాన్ చేస్తోంది. ఈ రకంగా తమకు న్యాయపరంగా బలమైన ఆధారాలు సేకరించడానికి అవకాశం దక్కుతుందని బీఆర్ఎస్ ప్రణాళికలు రచిస్తోంది. విప్ ఉల్లంఘన ద్వారా ఆయా ఎమ్మెల్యేలపై అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేసి, వారి సభ్యత్వాన్ని రద్దు చేయాలనేది బీఆర్ఎస్ వ్యూహంగా కనిపిస్తోందనే చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ విప్ జారీ చేయడం ద్వారా ప్రధానంగా పార్టీ మారినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న గూడెం మహిపాల్ రెడ్డి, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాసరెడ్డి, కాలే యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, డాక్టర్ సంజయ్‌పై ప్రభావం ఉంటుందనే టాక్ వినిపిస్తోంది. వీరి నియోజకవర్గాల్లో మున్సిపల్ ఎన్నికలు జరగడంతో విప్ ద్వారా వీరిని ఇరకాటంలో పడేయొచ్చన్న ఆలోచనలో కారు పార్టీ ఉన్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి.

మరోవైపు బీఆర్ఎస్ ఎత్తుగడలను గమనిస్తున్న సదరు ఎమ్మెల్యేలు కూడా ప్రతివ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నారనే ప్రచారం సాగుతోంది. విప్ జారీ చేస్తే ఓటింగ్‌లో పాల్గొని రిస్క్ తీసుకోవడం కంటే ఓటింగ్‌కు దూరంగా ఉండటమే మేలని వారు భావిస్తున్నట్లు సమాచారం. తద్వారా అటు కాంగ్రెస్ స్నేహాన్ని కాపాడుకుంటూనే ఇటు పార్టీ ఫిరాయింపుల చట్టం నుంచి తప్పించుకోవచ్చనేది వారి ఆలోచనగా తెలుస్తోంది. ఈ పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠను రేపుతున్నాయి.

## కరీంనగర్ మేయర్‌పై వీడిన సస్పెన్స్?

### చక్రం తిప్పిన నేతలు




**కరీంనగర్:** నగరపాలక సంస్థ మేయర్ ఎన్నికలో సంచలనం జరగుబోతుందా అంటే దాదాపు అవుననే సమాధానాలు వస్తున్నాయి. కరీంనగర్ మేయర్ స్థానం చేజిక్కించుకోవడం కోసం సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్ బాబు చక్రం తిప్పినట్లు తెలుస్తోంది. దీనికోసం తమ ప్రధాన ప్రత్యర్థైన బీఆర్ఎస్ కార్పోరేటర్ల మద్ధతు మంత్రి కోరుతున్నట్లు సమాచారం. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తో సహా పలువురు ఇండిపెండెంట్ల తో కలిసి మేయర్ పీఠం చేజిక్కించుకునేందుకు కాంగ్రెస్ ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మెత్తం 66 డివిజన్లు ఉన్నాయి. ముగ్గురు కోఆప్షన్ మెంబర్స్‌తో కలిసి మెత్తం ఆసంఖ్య 69 స్థానాలకు చేరుకుంది. అయితే మేయర్ పీఠానికి మ్యాజిక్ ఫిగర్ 35 స్థానాలు. ఇందులో బీజేపీ 30 స్థానాలు గెలువగా, కాంగ్రెస్ 14 సీట్లు సాధించింది. దీంతో బీఆర్ఎస్, ఎంఐఎం, స్వతంత్రులతో కలిసి కాంగ్రెస్ మ్యాజిక్ ఫిగర్ అందుకునేలా ప్లాన్ వేసింది. దీనికి గానూ ఒక్కో కార్పోరేటర్ సీటుకు రూ.1.5 కోట్ల నుంచి రూ. 3కోట్ల వరకూ బేరసారాలు జరిగినట్లు తెలుస్తోంది. అదే విధంగా మేయర్ పదవికోసం కాంగ్రెస్ నుంచి నలుగురు అభ్యర్థులు ఆశావాహులుగా ఉండగా మరో ఇండిపెండెంట్ అభ్యర్థిగా మేయర్ పీఠం ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్‌కు డిప్యూటీ మేయర్ ఆఫర్ చేసినట్లు సమాచారం. అయితే మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక రేపు ఫిబ్రవరి 16న జరగనుంది. దీంతో మేయర్ ఎంపికపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.


# లింగాపూర్‌లో మిన్నంటిన ఆధ్యాత్మిక చైతన్యం

## ఆదియోగి విగ్రహావిష్కరణ, పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం

**వాస్తవ నేస్తం,కోటగిరి :** మండలంలోని లింగాపూర్ (గన్నారం) గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ అడికేశ్ లింగమయ్య దేవస్థానం ఆదివారం భక్తజన సందోహంతో కిక్కిరిసిపోయింది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ చైర్మన్, నిర్మాణ దాత శ్రీ ముమ్మనేని రాజశేఖర్, పద్మశ్రీ వీణ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆధ్యాత్మిక వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి.

**ఘనంగా ఆదియోగి విగ్రహావిష్కరణ**

వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆదియోగి విగ్రహాన్ని ముమ్మనేని రాజశేఖర్ దంపతులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భక్తుల శివనామ స్మరణతో పరిసర ప్రాంతాలు మారుమోగాయి. ఉదయం నుంచే స్వామివారికి సుప్రభాత సేవ, రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా సాయంత్రం వేళ శ్రీ పార్వతీ పరమేశ్వర కళ్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా జరిపించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కళ్యాణాన్ని తిలకించి పునీతులయ్యారు. రాత్రి లింగోద్భవ కాలంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, హారతి సమర్పించారు. అనంతరం అగ్ని గుండాలు, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి. నేడు భారీ అన్నదానం శివరాత్రి ఉపవాసం ఉన్న భక్తుల కోసం సోమవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ వేడుకల్లో లింగాపూర్



సర్పంచ్ దేగాం హన్మంతు, గన్నారం సర్పంచ్ శారద రాజప్ప పటేల్, అడ్కస్ పల్లి సర్పంచ్ రామకృష్ణ, కల్లూరు సర్పంచ్ చెన్నూరి రాంరెడ్డి, కోటగిరి సర్పంచ్ బర్ల మధుకర్, కొత్తపల్లి సర్పంచ్ పుప్పల గంగారం పాల్గొన్నారు. వీరితో పాటు శ్రీనివాస్ రావు, వెనిగళ్ళ సుధీర్ బాబు, మూలే రమణారెడ్డి, ఓలే లింగప్ప, వివిధ గ్రామాల మాజీ ప్రజా ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

# శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు

## భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

## సిరిచెల్మ మల్లికార్జున స్వామిని దర్శించుకున్న జిల్లా ఎస్పీ దంపతులు, జడ్జి సందీప్





వాస్తవ నేస్తం,ఇచ్చోడ : జిల్లా వ్యాప్తంగా మహాశివరాత్రి పర్వదిన వేడుకలు ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధల మధ్య జరిగాయి. 'ఓం నమశ్శివాయ' అనే పంచాక్షరి మంత్రంతో శైవక్షేత్రాలన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శైవక్షేత్రాల్లో భక్తజన సందోహం ఆదిలాబాద్ జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాలైన బోరజ్ మండలం కోరాటలోని పంచముఖి శివాలయం, నేరడిగొండ మండలం కుంటాల జలపాతం వద్ద ఉన్న గుహలోని సోమేశ్వర ఆలయం, ఇచ్చోడ మండలం సిరిచెల్మలోని మల్లికార్జున స్వామి దేవాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. భక్తులు స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉండి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇచ్చోడ మండలం సిరిచెల్మ గ్రామంలోని పురాతన మల్లికార్జున ఆలయాన్ని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సతీసమేతంగా దర్శించుకున్నారు. వారు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అలాగే బోథ్ మున్సిఫ్ జడ్జి సందీప్ కూడా స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి, తీర్థప్రసాదాలను అందజేశారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు ఆలయాల్లో జాగారం నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పార్కింగ్, క్యూలైన్ల నిర్వహణను పోలీసులు పర్యవేక్షించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో జిల్లాలోని శైవక్షేత్రాలన్నీ శివమయమయ్యాయి.

# కొరియన్ లవ్ గేమ్...
# ఢిల్లీలోనే 800 మంది మిస్సింగ్

**న్యూఢిల్లీ**

ధ్రువ సినిమా చూశారా.. అందులో రామ్ చరణ్ శరీరంలో ఒక బగ్ ఉంటుంది. దాని ద్వారా అరవింద్ స్వామి రామ్ చరణ్ మాట్లాడిన మాటలు మొత్తం వింటూ ఉంటాడు. అతడు చేసే పనులకు కౌంటర్ ఇస్తూ ఉంటాడు. రామ్ చరణ్ ను చాలా ఇబ్బంది పెడుతూ ఉంటాడు. అటువంటి బగ్ మన శరీరంలో ఒకటి ఉంటే.. అది కూడా ఒక ఫోన్ రూపంలో ఉంటే.. ఎలా ఉంటుంది.. చదువుతుంటే ఆందోళన కలుగుతుంది కదూ.. మనదేశంలో ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలో ఘజియాబాద్ నగరంలో ముగ్గురు సోదరీమణులు ఒకరి వెంట ఒకరు బలవంతంగా చనిపోయారు. దీని వెనుక భయంకరమైన కారణాలు ఉన్నాయి.రియన్ సినిమాలు అంటే చాలా ఇష్టం. కొరియన్ డ్రామాలు బాగుంటాయి. కొరియన్ సినిమాలలో నేపథ్య సంగీతం అద్భుతంగా ఉంటుంది. ప్రారంభం నుంచి చివరి వరకు కొరియన్ సినిమాల్లో డ్రామా.. ఉత్కంఠ..ముని వేళ్ళ మీద నిలబెట్టే ఉద్వేగం ఇలా చాలా ఉంటాయి. అందువల్లే చాలామంది కొరియన్ సినిమాలను ఇష్టపడుతుంటారు.ప్రపంచానికి భిన్నంగా.. ఆలోచించడం కొరియన్ ప్రజలకు ఇష్టం. టెక్నాలజీతో వారు ఒక ఆట ఆడుకుంటారు. అయితే ఇతరుల భావోద్వేగాలను తమ గుప్పెట్లోకి తీసుకోవడం చాలా మంది కొరియన్ ప్రజలకు అలవాటు. దాన్ని ఒక ఆనందంగా వారు భావిస్తుంటారు. ప్రపంచం మొత్తం తమ చేతిలో ఉంది అని అనుకుంటారు. అందువల్లే కొరియన్ నిపుణులు కొంతమంది గేమ్స్ రూపొందించారు. ఈ గేమ్స్ కు సంబంధించిన ఏ వ్యవహారం కూడా అధికారికంగా బయటికి కనిపించదు. తయారీదారులు కూడా వారి వివరాలు బయటపెట్టరు. రకరకాల మాధ్యమాలలో తమ గేమ్స్ గురించి ప్రమోషన్ చేసుకుంటారు. ముఖ్యంగా యుక్త వయసు పిల్లల్ని లక్ష్యంగా చేసుకొని ఏదో ఒక రూపంలో వారికి దగ్గరవుతారు."నువ్వు స్మార్ట్ గా ఆలోచిస్తున్నావ్. నీ కళ్ళల్లో స్పార్క్ కనిపిస్తోంది. మీ అమ్మానాన్న పెట్టిన పేర్లతోనే నువ్వు ఉంటావా.. ఈ కొరియన్ పేరు ట్రై చెయ్.. అసలు నువ్వు స్కూల్ కి ఎందుకు వెళ్లాలి.. ఈరోజు కాలేజీకి ఎందుకు బంక్ కొట్టకూడదు.. నువ్వు ఒంటరిగా ఉంటూ జీవితాన్ని ఎందుకు ఆస్వాదించకూడదు.. ఈ నాలుగు గోడల మధ్యలోనే నువ్వు స్వేచ్ఛను ఎందుకు కోరుకోకూడదు.. కొత్త కొత్త టాస్క్ లు చేసేయ్. నీకు ప్రతిదీ ఉద్వేగంగా ఉంటుంది. చదువుకుంటే మహా అయితే ఉద్యోగం మాత్రమే చేస్తావు. ఒక కింద బానిసలాగా పనిచేయడం నీకు అవసరమా" ఇలా రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతుంటారు. టీనేజ్ పిల్లలలో భావోద్వేగాలు ఎక్కువగా ఉంటాయి. అదే సమయంలో కొరియన్ గేమ్స్ నిర్వాహకులు యూత్ పిల్లలను రెచ్చగొడుతుంటారు. ఒకరకంగా వారిని తమ ఆధీనంలోకి తీసుకుంటారు. ప్రతిరోజు ఒక టాస్క్ ఇస్తూ ఉంటారు. ఆ టాస్క్ పూర్తి చేసిన తర్వాత నువ్వు ప్రపంచంలోనే ధీరుడువి.. నీలాంటి శక్తివంతుడు ఎవరూ లేరు.. ఈ ప్రపంచంతో నీకే సంబంధం.. నీకై నువ్వు ఒంటరిగా వచ్చావు కదా.. ఒంటరిగా వెళ్తే తప్పేంటి అన్నట్టుగా యువతలో లేనిపోని ఉద్వేగాలను

## రైస్ మిల్లులో పెను ప్రమాదం..
## మిషన్ బెల్టులో చిక్కుకుని
## మహిళా కూలీకి తీవ్ర గాయాలు



**వాస్తవ నేస్తం,కోటగిరి :** పోతంగల్ మండల కేంద్రంలోని కిషన్ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో ఆదివారం ఉదయం జరిగిన ప్రమాదంలో ఓ మహిళా కూలీకి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తపల్లి గ్రామానికి చెందిన రేణి మొగులమ్మ , భర్త సాయిలు, గత కొంతకాలంగా ఈ రైస్ మిల్లులో కూలి పని చేస్తోంది. ఆదివారం ఆమె మిల్లులో ఊడ్చుతుండగా, ప్రమాదవశాత్తు ఆమె కట్టుకున్న చీర రన్నింగ్‌లో ఉన్న రైస్ మిల్ మిషన్ బెల్ట్‌కు చుట్టుకుంది. ఈ క్రమంలో ఆమె అదుపు తప్పి బెల్టు మీద పడటంతో మిషన్ లోపలికి లాగబడింది. ఈ దుర్ఘటనలో మొగులమ్మ రెండు కాళ్లకు మరియు కుడి చేతికి బలమైన గాయాలయ్యాయి. గమనించిన తోటి కార్మికులు వెంటనే మిషన్ ఆపి ఆమెను బయటకు తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం బాధితురాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

## బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు



**వాస్తవ నేస్తం,కోటగిరి :** మండల కేంద్రంలోని దేవునిగుట్ట తండాలో బంజారాల ఆరాధ్య దైవం, గొప్ప ఆధ్యాత్మికవేత్త మరియు సంఘ సంస్కర్త అయిన సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. లోక కల్యాణం కోసం, ముఖ్యంగా బంజారా సమాజ అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుని స్మరిస్తూ భక్తులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వక్తలు మాట్లాడుతూ, అడవి బిడ్డల హక్కుల కోసం మరియు వారి ఆత్మగౌరవం కోసం సేవాలాల్ మహారాజ్ చేసిన కృషి వెలకట్టలేనిదని కొనియాడారు. బంజారా ప్రజల జీవితాల్లో జ్ఞానజ్యోతిని వెలిగించిన మహోన్నత వ్యక్తిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. మూఢనమ్మకాలకు దూరంగా ఉంటూ, అహింసా మార్గంలో నడవాలన్న ఆయన బోధనలు నేటి సమాజానికి ఎంతో అవసరమని గుర్తుచేశారు. వేడుకల్లో భాగంగా సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, భజనలు భక్తులను అలరించాయి.ఈ కార్యక్రమంలో దేవుని గుట్ట తాండ నాయక్ మేగవత్ హేమ్లా నాయక్, కారోబారి గూగులోత్ దేవుల నాయక్, సర్పంచ్ కొర్ర రవి, ఉప సర్పంచ్ లక్ష్మన్, కోటగిరి సర్పంచ్ బర్ల మధుకర్, స్థానిక ఎస్సై సునీల్,ఆలయ కమిటీ చైర్మన్ కోలా సీతారాం నాయక్, మాజీ సర్పంచ్ లు గూగులోత్ తుకారాం, పుండలిక్ నాయక్, వాడిత్య తారసింగ్ కొర్ర విట్టల్, మాజీ ఏంపిటిసి ఫాకిరా నాయక్ ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, బంజారా సంఘాల ప్రతినిధులు మరియు తండా వాసులు అధిక సంఖ్యలో పాల్గొని, "జై సేవాలాల్" నినాదాలతో పరిసరాలను ఆధ్యాత్మికమయం చేశారు.

## మూడేళ్ల ముందు నుంచే వర్క్ షురూ...

**విజయవాడ**

ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు సమీపిస్తోంది. 2024 జూన్ లో వచ్చిన ఫలితాల్లో కూటమి ఏకపక్ష విజయం సాధించింది. 164 స్థానాల్లో గెలుపొందింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కీలక నేతలంతా ఓడిపోయారు. అయితే మరోసారి అదే పట్టును కొనసాగించాలని చూస్తోంది కూటమి. ముఖ్యంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కీలక నేతలు ఓడిపోయిన నియోజకవర్గాలపై ఇప్పుడు దృష్టి పెట్టింది. మరోసారి అక్కడ కూటమి గెలిచేలా గట్టి ప్రణాళికలు వేస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో చాన్స్ ఇవ్వకూడదని భావిస్తోంది. అందుకే వైసీపీ కీలక నేతల నియోజకవర్గాల విషయంలో గట్టి పట్టుదలతోనే ఉంది. తాజాగా జరిగిన కలెక్టర్ల రివ్యూలో ఆ జిల్లా మంత్రులకు సైతం సీఎం చంద్రబాబు నిర్దేశించినట్లు తెలుస్తోంది. అభివృద్ధిని చేయడం ద్వారా వైసీపీ కీలక నేతలకు చాన్స్ లేకుండా చూడాలన్నది చంద్రబాబు ఆలోచనగా సమాచారం.వైసీపీ కీలక నేతలుగా చాలామంది ఉన్నారు. అటువంటివారు మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయారు. మరోసారి వారు గెలవకుండా ఉండాలని చూస్తున్నారు చంద్రబాబు. అందులో భాగంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమర్నాథ్, పేర్ని నాని, కొడాలి నాని, వల్లభనేని వంశీ మోహన్, అంబటి రాంబాబు, జోగి రమేష్, ఆర్కే రోజా వంటి వారు మరోసారి అసెంబ్లీకి రాకుండా చేయాలన్న లక్ష్యంతో ఉన్నట్టు కనిపిస్తున్నారు. వారి విషయంలో జిల్లా మంత్రులతో పాటు ఎమ్మెల్యేలకు కీలక టాస్కులు ఇచ్చారు. అభివృద్ధి పరంగా చేపట్టాల్సిన అంశాల గురించి ఆయా జిల్లా కలెక్టర్లతో చర్చించారు సీఎం చంద్రబాబు.2024 అసెంబ్లీ ఎన్నికల్లో నాటి జగన్ క్యాబినెట్లో ఉన్న వారంతా ఓడిపోయారు. ఒక్క పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాత్రమే గెలిచారు. అయితే ఈసారి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కూడా ఓడించాలని చూస్తున్నారు చంద్రబాబు. ఎంతవరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 40 శాతం ఓటు బ్యాంకు గురించి ఆలోచన చేస్తోంది తప్ప.. ప్రధాన నియోజకవర్గాల్లో పట్టు తప్పుతోందని గ్రహించడం లేదు. అయితే ఈసారి జగన్ మోహన్ రెడ్డి సైతం సీనియర్లను బరిలో దించే అవకాశం ఉంది. అయితే అటువంటి నియోజకవర్గాలను ఎంపిక చేసుకున్న చంద్రబాబు ఎమ్మెల్యేలకు కీలక సూచనలు చేస్తున్నారు. అధికార యంత్రాంగం పరంగా కూడా అక్కడ ప్రత్యేక అభివృద్ధి పనులు చేపట్టాలని భావిస్తున్నారు. తద్వారా ఆ నియోజకవర్గాలను తిరిగి నిలబెట్టుకోవాలని చూస్తున్నారు. తాజాగా కలెక్టర్ల సదస్సులో దీనిపైనే కీలక ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com